వరద ప్రభావిత గ్రామాల్లో ఎమ్మెల్యే కోండ్రు పర్యటన

విశాలాంధ్ర.రేగిడి/రాజాం : వరద ప్రభావిత గ్రామాలు సంకిలి. రేగిడి తదితర గ్రామాల్లో రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ సోమవారం పర్యటించారు. సంకిలి బ్రిడ్జి వద్ద నాగావళి నది ప్రవాహాన్ని పరి శీలించారు. ఆ తరువాత రేగిడి గ్రామానికి ట్రాక్టర్ పై వెళ్లారు. సాయన్న గెడ్డ వరద ఉద్ధృతితో నీట మునిగిన పంటను పరిశీలించారు. జలదిగ్బంధంలో ఉన్న హైస్కూల్, పిహెచ్సి, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. నీట మునిగిన పంటల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి, పంట నష్టం నివేదికలు ప్రభుత్వానికి పంపిస్తామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను కలిసి పరిహారం వచ్చేలా చేస్తానని, రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు కోండ్రు జగదీష్, దూబ ధర్మారావు, కిమిడి అశోక్ కుమార్, వివిధ విభాగాల అధికారులు ఉన్నారు..

పట్టణ ప్రజలు కాచి చల్లార్చి నీరు తాగండి

మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణ ప్రజలు కాచి చల్లార్చి నీరు తీసుకో వాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి పిలుపు నిచ్చారు. మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, శానిటరీ ఇన్స్పెక్టర్ మరియు పబ్లిక్ హెల్త్ మేస్త్రీలతో టిబిఆర్ థియేటర్, రోడ్డు జయప్రకాష్ స్కూల్ రోడ్డు 14వ వార్డు చిన్న చెరువు గట్టు ఏరియాలలో పర్యటించారు.రోజువారీ పర్యవేక్షణలో భాగంగా ఈరోజు పట్టణ పరిధిలో జరుగుతున్న త్రాగునీటి సరఫరా లో ప్రజ లకు సురక్షిత మంచినీటి సరఫరా చేయుటకు వార్డులలో ఫ్రీ రేషెడ్యూల్ ఆఫ్ క్లోరిన్, పి.హెచ్. మొదలగు టెస్టులు చేయుటను స్వయంగా పరిశీలించారు. జయప్రకాష్ స్కూలు ఏరియాలో ఏర్పడిన డ్రెయిన్ బ్లాకులను పరిశీలించి వెంటనే క్లియర్ చేయించారు. తదు పరి చిన్న చెరువుగట్టు ఏరియాలో నీటి ప్రవాహానికి ఆటంకం కలుగు తున్న బ్లాకులను గుర్తించి జెసిబి తో క్లియర్ చేయించు పనులను ఆవార్డు కౌన్సిలర్ మరియు వార్డు ఇన్చార్జి వారితో స్వయంగా పరిశీలించారు. వాతావరణంలో ఏర్పడిన మార్పులు కారణంగా ప్రజలందరూ కూడా కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

ప్రమాద స్థితిలో ప్రవహిస్తున్న దగ్గు చెరువు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఎస్ కోట మండలం కేంద్రంలో శ్రీ దార గంగమ్మ ఆలయానికి వెనుక ప్రాంతంలో ఉన్న దగ్గు చెరువు కొన్ని రోజులుగా ప్రమాద స్థాయికి చేరింది. మొదటగా దగ్గు చెరువు కల్వర్టు పూర్తిగా నాశనమైంది. ఈ విషయాలకే విశాలాంధ్రలో పలు కథనాలను వేసీ ఉన్నాం. అయితే ఈ కల్వర్టు పై నుండి పుణ్యగిరి బర్మా కాలనీ జగనన్న కాలనీ రైల్వే కాలనీ శివాలయం వీధి వంటి ప్రాంతాలకు వెళ్లేటువంటి పాదచారులు, వాహనదారులు ప్రమాద కల్వర్టును చూసి భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో రైల్వే వాహనాలు అటుగా వెళుతున్నటువంటి స్థితిని చూసి భారీ వాహనాలు వెళ్లడం వల్లనే దగ్గుచెరువు కలవర్టు పూర్తిగా క్షిణించిందని పంచాయతీరాజ్ ఉప కార్య నిర్వహణ అధికారి సత్యనారాయణ రైల్వేవాహనాలను కల్వర్టుపై వెళ్లనుకుండా ఆంక్షలు వేశారు దీనితో స్పందించిన రైల్వే కాంట్రాక్టు ఇంజనీరింగ్ విభాగం వారు కల్వర్టును పూర్తిగా తొలగించి చెరువు నీరు బయటకు పోయే విధంగా రెండు పెద్ద గొట్టాలను వేసి దానిపై కంకర మట్టితో నింపసాగారు అయితే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి కంకర మట్టి పూర్తిగా కొట్టుకుపోతున్న కల్వర్టుకు పంచాయతీ సిబ్బంది ఇసుక మూటలను అడ్డగా పెట్టి తత్కాలికంగా కల్వర్టు కోతకు గురవకుండా తగు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికైనా స్థానిక అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు స్పందించి శాశ్వత పరిష్కార మార్గాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

వరదల నష్టం పై ప్రత్యేక సమీక్ష

ప్రత్యేక అధికారి శ్రీధర్ రాజా, తహాసిల్దార్ అజు రఫీజాన్

విశాలాంధ్ర-మెరకముడిదాం: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం తో పాటు మండలంలో పలు గ్రామాల్లో ఇల్లు పాక్షికంగా దెబ్బతినడంతో దీనిపై ప్రత్యేక అధికారి శ్రీధర్ రాజా మండల కేంద్రంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. మండలంలో 24గంటల్లో 94.2శాతం వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. రాచగుమడాం, సీరియాలపేట, గర్భాంలో పాక్షికంగా ఇల్లు గోడలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. అనంతరం 29 పంచాయతీల్లో వరి పాక్షికంగా మునిగిపోయినట్లు వరి పంట నష్టం పై నివేదిక ఉన్నతాధి కారులకు సమర్పిస్తున్నట్లు ఆయన సమీక్ష సమావేశంలో తెలపడం జరిగింది.అదేవిధంగా పులుగుమ్మి, ఊటపిల్లి, కొమ్మయనవలస మధ్యలో ఉన్న బామసాగరం గండ్లు పడడంతో తాత్కాలికంగా మరమ్మత్తులు చేపట్టినట్లు స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ రాజా తెలిపారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ తాహసిల్దార్ అజు రఫీజాన్, హెచ్. డి. టి.గిరిధర్, ఆర్ఐ నాగమణి గ్రామ రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి జనసేన ఆర్థిక సాయం

విశాలాంధ్ర-నెల్లిమర్ల : నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి రెల్లి వీధిలో భారీ వర్షాలకు పూరిపాక కూలిపోయింది. విషం తెలుసు కున్న జనసేన నాయకులు రవ్వా నాని బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా నాని బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వపరంగా బాధిత కుటుంబానికి సాయం అందించడానికి సహాయం చేస్తాను అన్నారు.

యువ గణేశ సేవా సంఘం సభ్యులు రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర- మెరకముడిదాం: మండలంలో గర్భాం గ్రామం లో పంచ ముఖి ఆంజనేయ కోలనిలో ఏర్పాటైన యువ గణేష్ సేవ సంఘ సభ్యులు ఉదార స్వభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిరాశ్రయులైన తాళ్లాభక్తుల శ్రీను ఇంటిని పునర్ నిర్మించేందుకు నిర్ణయించుకున్నారు. వీరు గణేష్ నవరాత్రుల భాగంలో లక్ష రూపాయల వ్యయంతో పౌరాణిక నాటికను వేయించేందుకు ఏర్పాటుచేసుకున్నారు. అయితే శ్రీను కుటుంబం వర్షాల కారణంగా రోడ్డున పడటంతో చలించిన కమిటీ సభ్యులు ఏకతాటిపైకి వచ్చి కార్యక్రమాన్ని రద్దు చేసి ఆ లక్ష రూపాయల వ్యయంతో ఇంటిని నిర్మించేందుకు తమవంతు సాయం అందించారు. వీరి ఉదార స్వభావానికి మెచ్చిన యువత, గ్రామ ప్రజలు వీరిని అభినందించడమే కాక తమవంతు సహాయాన్ని కూడా అందించేందుకు ముందుకు వచ్చారు.

నీటి మునిగిన వరి పంటను పరిశీలించిన జెడి

విశాలాంధ్ర -గుర్ల: మండలంలోని వరద ఉధృతి నీటిలో మునిగిన వరి పంటను సోమవారం వ్యవసాయ శాఖ జెడి వీ.టి రామారావు పరిశీలించారు గుర్లలో మునిగిన వరి పంటకు నష్టపరిహారం అందించాలని అధికారులను రైతులు కోరుతున్నారు పంటలను పరిశీలించిన వారిలో మండల వ్యవసాయ శాఖ అధికారి తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక సరఫరా లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలి

- లారీ యజమానులకు అన్నివిధాలా సహకరిస్తాం
- ఇంతవరకు 87 లారీలు రిజిస్ట్రేషన్
- కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం: లారీ జయమానులు ఉచిత ఇసుక సరఫరాలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని , ఇసుక సరఫరా సాఫీ గా జరిగేలా చూడాలని, లారీ యజమానులకు జిల్లా యంత్రాంగం నుండి అన్ని విధాలా సకహరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ఉచిత ఇసుక విధానాన్ని క్రమబద్దీకరించడానికి ప్రభుత్వం అన్నిరకాలుగా చర్యలు తీసుకుంటోందని, ప్రజలకు మేలు జరిగేలా లారీ యజమానులు సహకరించాలని కోరారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో లారీ యజమానులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి ప్రభుత్వం పాలసీ పై అవగాహన కలిగించారు. ఆన్లైన్ ద్వారా వాహనాలను రిజిస్టర్ చేసుకోవాలని, అలాగే ఇసుక కోసం కూడా వినియొగదారులు ఆన్లైన్ లోనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఇంతవరకు 87 వాహనాల రిజిస్ట్రేషన్ జరిగిందని తెలిపారు. ప్రస్తుతం బొబ్బిలి వద్ద 37 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, అక్టోబర్ లో మరో రెండు స్టాక్ పాయింట్ల లో 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి రాబోతున్నట్లు తెలిపారు. లారీలు ఇసుక కోసం గంటల తరబడి ఎదురు చూడ వలసిన అవసరం లేదని, ఆన్లైన్‌లో బుక్‌చేసుకోగానే ట్యాగ్ చేసిన వాహనదారుని మొబైల్ నెంబర్ కు టైం, స్లాట్ ఇవ్వడం జరుగుతుందని, అలాగే ఎప్పటికప్పుడు తెలుగు లో మెసేజ్ అలర్ట్స్ కూడా వస్తాయని, లారీ కెపాసిటీని బట్టి ధర నిర్ణయించడం జరుగుతుందని స్పష్టం చేసారు. కొత్త విధానాలను అమలు చేసేటప్పుడు ఇబ్బందులు ఉంటాయని, లారీ యజమానులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, పారదర్శకంగా పాలసీ ను అమలు చేయడం జరుగుతుందని, సందేహాలుంటే డిప్యూటీ కమీషనర్ తో ఎప్పుడైనా మాట్లాడవచ్చని కలెక్టర్ లారీ యజమానులకు తెలియజేసారు. లారీ లకు చెల్లింపులు ఏజెన్సీ నుండి గానీ, వినియోగదారుని నుండి గానీ వారు కోరుకున్న విధంగానే చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం గరిష్టంగా రోజుకు 20 టన్నుల వరకు ఒక వ్యక్తికి ఇవ్వడం జరుగుతుందని, జిల్లాలో సరాసరి రోజుకు 950 మెట్రిక్ టన్నులు బుకింగ్ జరుగుతోందని వివరించారు. ఈ సందర్భంగా లారీ యజమానులు శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ తో మాట్లాడి ఇసుక రీచ్ లను ఏర్పాటు చేయాలనీ, లారీ యజమానులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సమావేశంలో మణికుమార్ , మైన్స్ డి.డి. సూర్య చంద్ర రావు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, లారీ యాజమాన్యం ప్రతినిధులు పాల్గొన్నారు. ..

రాజీయే రాజమార్గం... సీనియర్ సివిల్ జడ్జి

14న జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర-రాజాం: రాజాం కోర్ట్ ఆవరణలో ఈ నెల 14న ఉదయం గ.10.30 ని. నుండి "జాతీయ లోక్ అదాలత్" నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవా సంఘ అధ్యక్షులు సీనియర్ సివిల్ జడ్జి సి.హెచ్. వివేక్ ఆనంద్ శ్రీనివాస్ తెలియజేశారు. ఈ లోక్ అదాలత్ లో రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరించబడునని, ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు. రాజీయే రాజమార్గమని, రాజీకి వీలైన ఎక్కువ కేసులను లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవాలని, లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని అధ్యక్షులవారు తెలియజేశారు. అలాగే లోక్ అదాలత్ లో సివిల్ కేసులు పరిష్కారామైతే కోర్ట్ ఫీస్ కూడా వాపసు ఇవ్వబడునని తెలియజేశారు. జాతీయ లోక్ అదాలత్ కి సంబంధించి సోమవారం మధ్యాహ్నం గం.3.00 లకు రాజాం కోర్ట్ ఆవరణలోని సీనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్ హాల్లో పోలీసు ఎక్సైజ్ అధికారులతో సీనియర్ సివిల్ జడ్జి సి.హెచ్. వివేక్ ఆనంద్ శ్రీనివాస్, జూనియర్ సివిల్ జడ్జి పి.యెస్.వి.బి. కృష్ణ సాయితేజ సమావేశం నిర్వహించారు. అందరూ 14(శనివారం) జరగబోయే "జాతీయ లోక్ అదాలత్" నకు సహకరించి రాజీకి అనుకూలమైన వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించుకోవాలని ఇరువురు న్యాయమూర్తులు కోరారు. ఈ సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.సూర్య కుమార్, రాజాం టౌన్ సిఐ కె. అశోక్ కుమార్, రాజాం ఎక్సైజ్ సిఐ బి.శ్రీధర్, ఎక్సైజ్ ఎస్సై ఎస్. చంద్రశేఖర్, రాజాం, సంతకవిటి, ఆర్.ఏ. వలస పోలీసు సిబ్బంది, రాజాం ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీలో గాయపడ్డ బాధితునికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించిన వైసీపీ

విశాలాంధ్ర-గుర్ల: ఇటీవల అచ్యుతాపురంలోని ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మండలంలో చిన్ననగాళ్ళవలస గ్రామానికి చెందిన చందక బంగారునాయుడుకు గాయాలైన సంగతి తెలిసిందే. వైసీపీ తరపున మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రూ.1 లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. జడ్పీ చైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు సోమవారం గ్రామానికి వెళ్లి బంగారునాయుడుకు చెక్కును అందజేశారు. పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి, వైకాపా జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు, జడ్పిటిసి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు తిరుపతిరావు, చిన్నరావు,జె సి ఎస్ కన్వీనర్ బంగారునాయుడు, మధుసూదన్ రావు, మండల పార్టీ అధ్యక్షులు స్వామినాయుడు, మణి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సీఎం సహాయనిధికి రూ1,35,443 విరాళం ఇచ్చిన పట్టణ మెప్మా సిబ్బంది

విశాలాంధ్ర-బొబ్బిలి : విజయవాడ వరద బాధితుల సహాయార్ధం బొబ్బిలి పట్టణం మెప్మా సిబ్బంది తమ వంతుగా ముఖ్యమంత్రి సహాయనిధికి ఒక లక్ష ముప్పయి ఐదు వేల నాలుగు వందల నలభై మూడు రూపా యలు చెక్కును బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి చేతులమీదుగా మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్ము నాయుడు సమక్షంలో ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే. రంగారావు(బేబీ నాయన)కి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అంద జేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబినాయన మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ని సిబ్బంది ని అభినందించారు.

కాజ్ వే పై ఉధృతంగా నీరు

సంత గైరమ్మ పేట నుంచి పలు గ్రామాలకు రాకపోకలు బంద్



విశాలాంధ్ర-శృంగవరపుకోట : గడిచిన రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు సంత గైరమ్మ పేట గ్రామం వద్ద ఉన్న కాజ్ వే పైనుంచి నీరు ప్రవహిస్తుంది. దీంతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచాయి. ఈ గ్రామం నుంచి ఆలుగుబిల్లి, చమలపల్లి ఇతర ప్రాంతాలకు వెళ్లే దారి పై నీరు చేరడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. మధ్యాహ్నం సమయానికి నీరు తగ్గడంతో యధావిధిగా రాకపోకలు ప్రారంభం అయ్యాయి. రాత్రి నుంచి మధ్యాహ్నం వరకు రాకపోకలు ఆగిపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు పంచాయతీ కార్యదర్శి లక్ష్మి ఆధ్వర్యంలో ఈ వంతెన పైనుంచి నీరు ఇతర ప్రాంతాలకు మళ్లించేందుకు జెసిబి ఏర్పాటు చేసి ఈ నీటిని దారి మళ్లించడంతో నీటి ఉధృతి తగ్గింది. నీటి ఉధృతి తగ్గడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ కు జిఎంఆర్ సంస్థ రూ. 2.50 కోట్ల విరాళం

విశాలాంధ్ర-రాజాం: రాష్ట్రంలో తలెత్తిన తుఫాన్, వరద తాకిడి దృష్ట్యా సిఎం రిలీఫ్ ఫండ్ కు ప్రముఖ పారిశ్రామిక సంస్థ జిఎంఆర్ గ్రూప్ రూ.2.50 కోట్ల సహాయం ప్రకటించింది.ఈ మేరకు సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ను కలిసి చెక్కు అందజేసారు.

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పరిశీలన

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో నందిగాం గ్రామ పంచాయతీ లో తుఫాను ప్రభావిత ప్రాంతాలలో ఎమ్మెల్యే బేబీ నాయన పర్యటించారు, ఈ సందర్శన లో ఎంపిడిఓ రామకృష్ణ, తహసీల్దార్ హేమంత్ కుమార్, ఆ గ్రామ సర్పంచ్, ఎక్స్ సర్పంచ్ ,ఇరిగేషన్ ఎ ఈ,గ్రామ పెద్దలు, ప్రజలు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో చర్యలు చేపట్టిన ప్రజారోగ్య సిబ్బంది

విశాలాంధ్ర -విజయనగరం: విజయ నగరం పట్టణంలో వర్షాల వల్ల దెబ్బతిన్న ప్రాంతాలలో ప్రజారోగ్య సిబ్బంది సోమ వారం మరమ్మతు పనులను చేపట్టారు. సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఇతర సిబ్బంది సోమవారం పెద్ద చెరువు అవుట్ ఫ్లో పరిశీలించారు. పారిశుధ్య పర్యవేక్షలతో కలిసి పరిస్థితి పై సమీక్షించారు. ప్రధాన కాలువలో పేరుకుపోయిన చెత్త గుర్రపు డెక్కను జెసిబిలు సహాయంతో తొలగించారు. బుచ్చన్న కోనేరు ప్రాంతంలో శిథిలమైన ఇంటి పరిస్థితిని పరిశీలించారు. శాంతినగర్ లో గత రెండు రోజులగా కురిసిన భారీ వర్షాల వల్ల కూలిన పాత భవనం యొక్క పెద్ద గోడను జెసిబి సహాయంతో ప్రజలకు ఇబ్బంది లేకుండా రాకపోకలకు అంతరాయం కలగకుండా తొలగించారు. అలాగే గుడ్స్ షెడ్ ప్రాంతంలో రోడ్డుపైకి వచ్చిన వర్షపు నీటిని బాబ్ కార్టు సహాయంతో శుభ్రపరిచారు. తోటపాలెం నాయుడు కాలనీ పైడిమాంబ టవర్స్ ప్రాంతంలో గుర్రపు డెక్కలను జెసిబి యంత్రంతో తొలగించారు. 45వ డివిజన్ ఎస్.కోట రోడ్డులో నిలిచిన వర్షపు నీటిని పరిశుభ్రపరిచారు. అలాగే సిరత్ చెరువు నీరు బయటకు రాకుండా మట్టి ఎత్తును జెసిబి సహాయంతో పెంచారు. 43వ డివిజన్ నేషనల్ స్కూల్ ప్రాంతంలో నిలిచిన వర్షపు నీటిని జెసిబి సహాయంతో సిబ్బంది తొలగించారు.

తీరప్రాంత గ్రామాల్లో వైద్యాధికారి సందర్శన

విశాలాంధ్ర -భోగాపురం: మండలంలో తీరప్రాంత గ్రామాలైన ముక్కాము, చేపల కంచెరు గ్రామాల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి సందర్శించారు.. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ఆయన సందర్శించారు. భారీ వర్షలు కారణంగా మంచి నీరు కలిసితమవుతుందని నీటిని మరగ పెట్టుకొని త్రాగాలని గ్రామస్తులు కు వివరించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అలాగే నీరు నిల్వలేకుండా ఎప్పటికప్పుడు గ్రామాల్లో పంచాయితీ సిబ్బంది తో సమన్వయము చేసుకొని పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అంటువ్యాధుల నివారణకు కావలిసిన మందులు వైద్య శిబిరల్లో ఉన్నది లేనిది పరిశీలించారు. పోలిపల్లి వైద్య సిబ్బందికి తగిన సూచనలు చేశారు.. ఈయన వెంట వైద్యాధికారులు వెంకటేష్, బి. దివ్య ఉన్నారు.

ఏళ్ళ తరబడి వారికి కొబ్బరి చెట్లే విద్యుత్ స్తంభాలు

విశాలాంధ్ర-జామి : మండలంలోని అన్నంరాజుపేట గ్రామంలో తెలకలవీదిలో గత 5ఏళ్ళగా విద్యుత్ స్తంబాలుకు బదులుగా కొబ్బరిచెట్లును, కర్రలను వినియోగి స్తున్నారు. ఈప్రాంతంలో దాదాపు 8 ఇళ్ళుకు సంభందించిన కుటుంబాలు నివాసముంటున్నాయి. విద్యుత్‌లైన్ ఉన్నా విద్యుత్ స్తంబాలు లేకపోవడంతో వీరంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేకసార్లు, పంచాయతీ, సచివాలయం చుట్టూ తిరుగుతున్నా పంచాయతీలో నిధులు లేవని దాటవేస్తున్నారు. దీంతో ఆయా కుటుంబాల ఇబ్బందులు అలాగే ఉన్నాయి. తమను ఎప్పటికైనా ఆదుకుంటారనే ఆశతో వీరంతా ఎదురుచూస్తున్నారు. ఇదిలా వుండగా ఇటీవల పంచాయతీ పరిదిలోని అవసరం లేని ప్రాంతాలకు కొత్తగా విద్యుత్ స్తంబాలను మం.జరు చేయడమే కాకుండా కొత్తగా ఏర్పాటు చేయడం వీరిని మరింత బాదిస్తోంది. జనావాసాలు ఉన్న చోట కాకుండా అవసరం లేని చోట స్తంబాలు వేయడం దారుణమని వారు వాపోతున్నారు. ఈవిష యమై తాము ఉన్నతాధి కారులకు ఫిర్యాదు చేస్తామని గ్రామ టీడీపీ నేత, శానాపతి అప్పలనాయుడు తెలిపారు.

ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర-దత్తిరాజేరు : ఏడీఏ మహారాజన్.మండల పరిధిలో గల గడసాం గ్రామంలో ముంపునకు గురైన పంట పొలాలను మన రాష్ట్ర సెర్ప్ మరియు సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచనల మేరకు ఏడిఏ మహారాజన్ సోమవారం పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 75 ఎకరాలు వారి ముంపునకు గురైనట్లు తెలియజేశారు. మరో రెండు రోజుల్లో పొలాల్లోకి వెళ్లి రైతు వరి పంట నష్టం లెక్కిస్తామని తెలియజేశారు. పొలాల్లో చేరిన నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించి ఎకరానికి 30 కిలోల యూరియా మరియు 15 కిలోల ఫోటాస్ ఎరువులను వేసుకోవాలని, ఈ వాతావరణానికి పాము పొడ తెగులు ఉధృత ఎక్కువ అవడానికి అవకాశం ఉన్నందున ఎకరానికి 200 మిల్లీలీటర్లు ప్రొపి కొనజోల్, 200 లీటర్లు నీటిలో కలిపి పిచికారి చేయా లని, అదేవిధంగా అగ్గి తెగులు నివారణకు 120 గ్రాములు ట్రైసైక్లో జోల్, దోమపోటు నివారణకు 300 గ్రాములు ఎసిఫేట్ పిచికారి చేయాలని తెలియజేసారు. ఈ కార్యక్ర మంలో శాస్త్రవేత్తలు ఎంఎంవి శ్రీనివాస్, స్వాతి ఏరువాక కోఆర్డినేటర్ కే లక్ష్మణ్,, తహసిల్దార్, పెదమానాపురం ఎస్ఐ జయంతి, వ్యవసాయ అధికారి అనురాధ, తెలుగుదేశం పార్టీ నాయకులు మజ్జి మహేష్, ఇజ్జిరోతు అప్పలనాయుడు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన పెను ముప్పు

మొరాయించిన పాలవలస కెనాల్ గేట్లు

గట్లపైనుంచి పొంగిపొర్లిన కాలువ

ప్రమాదాన్ని గుర్తించి క్రేన్ సహాయంతో గేట్లు ఎత్తివేత

విశాలాంధ్ర -పూనపాటి రేగ: మండలంలో రెండు రోజులుగా పడుతున్న భారీ వర్షాల కారణంగా చెరువులు, వాగులు పొంగి పాల్వలస కెనాల్ కాలవ విజృంభించి ప్రవహించడంతో పక్కనే ఉన్న గ్రామమైన లంకలపల్లి పాలెం వ్యవసాయ భూములను ముంచేయడంతోపాటు. అతి ప్రమాదకరంగా కాలువ గట్టు పై నుండి ప్రవహించి గ్రామం మీదకు వెళ్లే పరిస్థితి ఏర్పడడంతో స్థానిక ప్రజలు మండల అధికారులు సరైన సమయంలో స్పందించి కాల్వ ప్రవాహానికి అడ్డుగా ఉన్న మొక్కల్ని కొంతమేర తొలగించడంతోపాటు కెనాల్కు ఉన్న గేట్లు మరమ్మతులు చేయకపోవడంతో సరైన సమయంలో అవి ఓపెన్ అవ్వకపోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వెంటనే మండల అధికారులు స్పందించి కెనాల్ గేట్లు వద్దకు వెళ్లి స్థానిక జనసేన నాయకుడు రౌతు శ్రీను, మరికొందరు రైతులు సహాయంతో క్రేన్ రప్పించి ఇరుక్కుపోయిన గేటును పైకి లేపించి నీటిని దిగువకు వదిలారు. దీనితో స్థానిక ప్రజలు కొంతవరకు చెందారు. వచ్చిన అధికారులతో స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహంతో సంభాషిస్తూ ఎప్పుడూ తుఫానులో వచ్చినప్పుడు వరదలు వచ్చినప్పుడు అధికారులు వచ్చి తూతూ మంత్రంగా అప్పటిక అనుకూలంగా పని పూర్తిచేసి చేతులు దులుపుకొని వెళ్లిపోవడం తప్ప శాశ్వతంగా కాలువలను బాగు చేసే పని ఎప్పుడూ చేయట్లేదని తమ ఆవేదనను అధికారుల ముందు వెల్లబుచ్చారు. కనీసం మండల అధికారులు కాలవలో అడ్డుగా పెరిగిన మొక్కలను తొలగించి ఉన్నట్లయితే ఈ కాలవంతంగా పొంగి ఉండేది కాదని పంట పొలాలు మునిగిపోయి ఉండేవి కాదని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో రాధిక, ఈవోపీఆర్డి శ్రీనివాసు, ఏపీవో, ఇరిగేషన్ శాఖ అధికారి, ఎల్బీ పాలెం వైసీపీ నాయకులు రౌతు సాయి, గ్రామ అధికారులు మండల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

నేడు, రేపు కూడా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగానే వుండాలి

కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశం

విశాలాంధ్ర-విజయనగరం: భారీ వర్షాల ప్రభావం మంగళవారం వరకు వుంటుం దని జిల్లాలోని అధికారులు, సిబ్బంది మరో రెండు రోజులపాటుఅప్రమత్తంగా వుంటూ ఎక్కడా ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. జిల్లాలో గత రెండు రోజులుగా గ్రామం నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు అంతా అప్రమత్తంగా వ్యవహరించి ముందు జాగ్రత్తలు చేపట్టిన కారణంగా భారీవర్షాల కురిసినప్పటికీ ఎలాంటి ఘటనలకు తావులేకుండా నివారించగలిగామని పేర్కొంటూ రానున్న రెండు రోజులూ అదే అప్రమత్తత కొనసాగించాలన్నారు. జిల్లా లోని మండల, జిల్లా స్థాయి అధికారులు, నోడల్ అధికారులతో కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ భారీ వర్షాల అనంతరం చేపట్టిన సహాయక చర్యలపై సోమవారం టెలి కాన్ఫరెన్స్ లో సమీక్షించారు. ప్రధానంగా గణేశ్ విగ్రహాల నిమజ్జనాలు గ్రామాల్లో జరిగే అవకాశం వున్న దృష్ట్యా వాగులు, చెరువులు, నదులు, కాల్వల వద్దకు యువత వెళ్లి నిమజ్జనాల్లో పాల్గొనేటపుడు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, యీ విషయంలో పోలీసు, రెవిన్యూ అధికారులు సమన్వయంతో వ్యవహరించి జాగ్రత్తలు చేపట్టాలన్నారు. జిల్లాలో భారీవర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులకు వెంటనే తాత్కాలిక పునరుద్దరణ పనులు చేపట్టాలన్నారు. వ్యవసాయ పంటనష్టం అంచనాలు రూపొందించేటపుడు అవసరమైతే డ్రోన్లను వినియోగించి పరిస్థితిని అంచనా వేయాలన్నారు. చెరువులు, వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నందున వాటిని దాటి వెళ్లే ప్రయత్నం చేయకుండా వాటి వద్ద పహరా ఏర్పాటు చేయాలని, అవసరమైతే రాకపోకలు నిలిపివేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ వైద్య శిబిరాలు నిర్వహించి ప్రతి ఇంటికీ వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారికి ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులను విస్తృతంగా చేపట్టాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా అన్ని తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేపట్టాలని ఆదేశించారు.

జిల్లాలో ముమ్మరంగా సహాయక చర్యలు : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో భారీ వర్షాల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మురికి కాల్వల్లో పూడికతీత పనులు నిర్వహించి వ్యాధులు ప్రబలకుండా వీధులను పరిశుభ్రం చేసారు. తాగునీరు కలుషితం కాకుండా రక్షిత నీటి సరఫరా పథకాల ట్యాంక్ లను క్లోరినేషన్ చేసారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు సరఫరా చేసారు. పోలీస్, రెవిన్యూ శాఖల ఆధ్వర్యంలో రోడ్లు, కల్వర్టుల వద్ద నీటి ప్రవాహం అధికంగా వున్నా చోట ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు పహరా ఏర్పాటు చేసారు.

ముంపుకు గురైన వరి పంట పరిశీలించిన వ్యవసాయ అధికారి నీలిమ

విశాలాంధ్ర-పూసపాటిరేగ: రెండు రోజులుగా తుఫాన్ ప్రభావంతో అధిక వర్షపాతం నమోదు కావడంతో చెరువులు, వాగులు పొంగిపొర్లి పల్లం వ్యవసాయ భూములను ముంపునకు గురిచేసాయి. సోమవారం ఉదయం వర్షం కొంత శాంతించడంతో వ్యవసాయాధికారి కే నీలిమ తమ సిబ్బందితో ముంపునకు గురైన వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు సుమారుగా 150 ఎకరాలు వరి పంట నీట మునిగిందని ప్రాథమిక అంచనాగా తెలిపారు ముంపుకు గురైన గ్రామాలు కుమిలి గ్రామంలో 83 ఎకరాలు, చౌడువాడలో 33 ఎకరాలు, గోవిందపురం పరిధి ఎల్వీ పాలెం లో 25 ఎకరాలు, చల్లవని తోటలో 8 ఎకరాలు ముంపుకు గురైనట్టుగా తెలిపారు. రైతులు వీలైనంత త్వరగా వరి పొలంలో నుంచి నీరు బయటకు పోయే విధంగా ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులతో పాటు రైతులు పాల్గొన్నారు.

శాఖా గ్రంధాలయం కు ఇన్వెటర్ బహూకరణ

విశాలాంధ్ర -శృంగవరపుకోట: శృంగవరపుకోట శాఖగ్రంథాలయానికి 30 వేలు విలువ చేసే ఇన్వెటర్ ను డాక్టర్ ఆర్. త్రినాధ్ రావు, సాయికృష్ణ హాస్పిటల్, ఎం.రేవతి ఎఈఈ (ఆర్‌డబ్ల్యుఎస్), చిప్పాడ ఈశ్వరరావు. రైల్వేగూడ్స్ గార్డ్. కోన దేవి. సూపర్వైజర్ ఉసీడీఎస్ వీరు బహుమతిగా అందించారు. వీరికి గ్రంధాలయ పాఠకులు లైబ్రేరియన్ దామోదర్ శ్రీధర్. పత్రికా ముఖంగా కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో సోమవారం ఎమ్‌డిఓ ఎస్.రామకృష్ణ కిందస్థాయి అధికారులతో మాట్లాడుతూ ఏదైతే వర్షం తగ్గుముఖం పట్టిందో దాన్ని అనుసరించి తర్వాత చేయాల్సిన శానిటేషన్ ప్రక్రియ కొరకు అన్ని గ్రామ పంచాయతీల్లో కావలసినంత బ్లీచింగ్ గాని ,లిక్విడ్ క్లోరిన్, లైమ్ గాని , ఉన్నాయా లేదా? లేదంటే ప్రొక్యూర్ చేసుకొని వాటిని అందుబాటులో ఉంచుకోవాలని అందరి కార్యదర్శులకు తెలియజేయడం జరిగింది. అలాగే ప్రతిరోజు కూడా క్లోరినేషన్ చేయించి పరిశుభ్రమైన నీరు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించడం అయినది. రాగల రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు అన్ని రకాలైన సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులు కూడా సూచించామని తెలిపారు. గ్రామ కార్యదర్సులు ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాలను పరిశుభ్రం గా ఉంచాలని ఈ సమావేశం లో కింద స్థాయి అధికారులకు వివరించారు.

శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీ ఆదాయం 4,70,486

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణం లావేరు రోడ్డు నందు వేంచేసియున్న శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం హుండీలను సోమవారం ఉద యం దేవదాయ ధర్మాదాయశాఖ, ఇన్స్పెక్టర్ పీవీ లక్ష్మి ఆధ్వర్యంలో లెక్కించడం జరిగింది. విజయ నగరం జిల్లా చీపురుపల్లిలో గల శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆదాయం 4,70,000 486 వచ్చినట్లు ఇన్స్పెక్టర్ పీవీ లక్ష్మి తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ పీవీ లక్ష్మి స్థానిక నాయకులు, అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ గోవిందరావు కమిటీ సభ్యుల సమక్షంలో దేవాలయం వద్ద తెరచి లెక్కించగా తే 27.05.2024 ది నుండి 09.09.2024 ది వరకు రూ.4,70, 486.00లు వచ్చిందని ఈవో జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇప్పిలీ సూర్యప్రకాష్, సూరు వెంకట కుమారస్వామి గోవింద్ నాయుడు, కానిస్టేబుల్, ఎస్.సలీమ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తుఫాన్ నేపథ్యంలో నగరవాసులు జాగ్రత్తగా ఉండాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల : తఫాన్ నేపథ్యంలో నగరవాసులు జాగ్రత్తగా ఉండాలని చైర్‌పర్సన్ బంగారు సరోజని సూచించారు. నెల్లిమర్ల నగరపంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. చంపావతి, చెరువుల వద్దకు వెళ్లి ప్రమాదాల భారిన పడొద్దని సూచించారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలని అన్నారు. నగరపంచాయతీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో కమిషనర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు, శానిటరీ ఇన్సెక్టర్ ఉమాభాస్కర రావు పాల్గొన్నారు.

విజయవాడ సహాయక చర్యల్లో రాజాం కమిషనర్

విశాలాంధ్ర-రాజాం : విజయవాడ లో ఫ్లడ్ డ్యూటీలో ఉన్న రాజాం మున్సిపల్ కమిషనర్ జె. రామప్పల నాయుడు సోమవారం 45 వ డివిజన్ లో పెద్దఎత్తున పారిశుద్య కార్యక్రమాలు పర్యవేక్షిస్తూ. దగ్గర ఉండి పనులు చేస్తున్నారు.

గుర్లలో వరద నీటిలో మునిగిన వరి పంటను పరిశీలించిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-గుర్ల: మండలంలోని గుర్లలో వరద దాటికి నీటిలో మునిగిన వరి పంటను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. మునిగిన వరి పంటకు నష్ట పరిహారం అందించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని జెడ్పీ చైర్మన్ ని రైతులు కోరారు .పంటలను పరిశీలించిన వారిలో. ఎంపిపి ప్రతినిధి,వైకాపా జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు గారు,జడ్పిటిసి శీర అప్పలనాయుడు, బంగారునాయుడు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు తిరుపతిరావు, చిన్నరావు, జెసిఎస్ కన్వీనర్ మధుసూదన్ రావు, మండల పార్టీ అధ్యక్షులు స్వామినాయుడు, తహశీల్దార్ ఆదిలక్ష్మి, మండల వ్యవసాయ శాఖ అధికారి తిరుపతిరావు ఉన్నారు.

కాలం రాజుపేట లో పారిశుద్ధ్య విద్యుత్ లైన్లు మరమ్మత్తులు చేపట్టిన సర్పంచ్

విశాలాంధ్ర-గజపతినగరం: మండలంలోని కాలం రాజుపేట గ్రామంలో సోమవారం గ్రామ పరిధిలో గల కాలవల్లోని మురికి నీరు ఇటీవల కురుస్తున్న భారీవర్షాలకు కాలువలు నిండి మొరిగి నీరు ప్రవహిస్తు న్నందున కాలువల్లో పూడికలను పారిశుధ్య పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. అలాగే గ్రామంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు విద్యుత్ వైర్లను సరిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకున్నారు

ఇసుక అక్రమ రవాణా పైన తహశీల్దార్ శ్రీను ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది దాడులు

విశాలాంధ్ర-బొబ్బిలి : మండలం అలజంగి గ్రామం వేగావతి నది లో ఇసుక అక్రమ రవాణా పై స్థానికులు ఫిర్యాదు మేరకు తాసిల్దార్ ఎం శ్రీను ఆదేశాల మేరకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, గ్రామ రెవెన్యూ అధికారి సుధాకర్, వీఆర్‌ఏ కూమారి లో ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి నాలుగు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని వాహనాలకు సంబంధించి సీబుకులను స్వాధీనం చేసుకున్నారు.

పొంగిపొర్లుతున్న వాగులు, కాలనీలలో, రోడ్లపై నీరు

సహాయక చర్యల్లో అధికారులు

విశాలాంధ్ర-రాజాం: ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు రాజాం మున్సిపాలిటీ పరిధిలోని చీపురుపల్లి రోడ్డుపై నీరు పొంగి పొర్లుతుంది. రోడ్డుపై వెళ్లే ప్రయాణికులకు, ముఖ్యంగా గాయత్రి కోలనీ నుంచి బావిరేతు అమ్మవారి గుడి వరకు ఉన్న లోతట్టు ప్రాంతానికి ఎగువున ఉన్న చెరువుల్లోంచి నీరు భారీగా వచ్చింది. దీంతో రోడ్డు కన్పించని పరిస్థితి తలెత్తింది.అటు గోతులు ఇటు కన్పించని రోడ్డు ద్విచక్ర వాహనదారులకు అవస్థలు వాహనదారులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. కన్పించని రోడ్డుపై వాహనాలు నడవడం ఇబ్బందికరంగా మారింది.సహాయక చర్యలలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రధానంగా చీపురుపల్లి రోడ్డుపైకి, రాజాం పరిసర ప్రాంతాలలో పలు కాలనీలలో వరద నీరు భారీగా రావడంతో మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. విజయవాడ లో ఫ్లడ్ డ్యూటీలో ఉన్న రాజాం మున్సిపల్ కమీషనర్ జె. రామప్పలనాయుడు స్థానికంగా ఉన్న శానిటరీ ఇనె స్పెక్టర్ చేగొండి హరిప్రసాద్ తో నిత్యం సంప్రదిస్తూ,పరిస్థితిని సమీకిస్తు పలు సూచనలు చేస్తూ సిబ్బందికి ఆదేశిస్తున్నారు. శానిటరీ ఇన్స్పెక్టర్ అక్కడే ఉండి, అవసరమైన సహాయక చర్యలు తీసుకుంటూ, తీవ్రత ఎక్కువైతే తీసుకోవాల్సిన చర్యలపై కూడా కమీషనర్ తో ఆలోచన చేస్తున్నారు. ఇప్పటికే 20 మంది ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి, మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా డ్రైయిన్ల లో సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు.

అరాచకాలు కొనసాగితే ఆ ముగ్గురే మిగులుతారు ..

మాజీ విప్ గద్దే బాబురావు

విశాలాంధ్ర-చీపురుపల్లి: జగన్మోహన్ రెడ్డి నిరంకుసత్వంగా తన చర్యలను కొనసాగిస్తే ఆ పార్టీలో రానున్న ఎన్నికల్లో కూడా ఆ ముగ్గురే మిగులుతారని మాజీ విప్ గద్దె బాబురావు అన్నారు. సోమవారం చీపురుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గడిచిన ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి నిరంకుసత్వానికి విసిగిన జనం ఓటుతో సరైన గుణపాఠం చెప్పినప్పటికీ జగన్ మోహన్ రెడ్డి లో ఎటువంటి మార్పు రాకపోవడంబాధాకరమన్నారు. ఒకపక్క వరదలతో విజయవాడ ప్రాంతంలో ప్రజలు విలవిలాడుతున్న జగన్మోహన్ రెడ్డి తన రాక్షసత్వాన్ని చాటుకున్నారన్నారు. వరదలతో రాష్ట్రం అతలాకుతలం అవుతున్నప్పటికీ 60 టన్నుల బరువు ఉన్న ఒక్కో పొడవును ఒకేసారి 65, 66, 67, ప్రకాశం బ్యారేజీ గేట్లు వద్ద మధ్య భాగాన గుద్దించి పగలగొట్టడానికి కుట్ర జరిపారన్నారు. ఇదే ప్రమాదం జరిగి ఉంటే కృష్ణ జిల్లా వెస్ట్ గోదావరి తదితర ప్రాంతాల్లో మనుషులు గాని పశువులు గాని పక్షులు గాని బ్రతికి బట్ట కట్టేవారు కాదని గద్దె ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మానవత్వం లేకుండా ఇటువంటి దుశ్చర్యకు పాల్పడడం బాధాకరమన్నారు. పంచభూతాలతో పాటు ఇసుక , మైనింగ్, మద్యం, గంజాయి, గుట్కా వంటి వ్యాపారాలను జె బ్రాండ్ కింద అమ్ముకొని లక్షలాది కోట్లు సంపాదించుకున్న జగన్ వంటి నాయకులకి బాధితుల కష్టాలు కానరావడం లేదన్నారు. ఇప్పటికీ బాధితులకు కనీసం ఆహార పొట్లాలు కూడా అందించకపోవడం ఆయన పనితీరుకు నిదర్శనం అన్నారు. వరద బాధితుల ఉసురు జగన్మోహన్ రెడ్డికి తనంన& తగులు తుందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డితో పాటు సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి మాత్రమే ఆ పార్టీలో మిగులుతారన్నారు. గడిచిన ఎన్నికల్లో 11 సీట్లు దక్కించుకున్న వైసిపి 2029 ఎన్నికల నాటికి మూడు సీట్లుకి పరిమితం కావడం తధ్యమన్నారు. అంతర్జాతీయ ప్రఖ్యాతిగాంచిన రాజకీయ నాయకుడిగా ఖ్యాతి గరించిన చంద్రబాబు నాయుడు వంటి నాయకులు వరద బాధితులతో సమానంగా తాను ఒక బాధితురుల వారికి సహకారం అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతుంటే అటువంటి వారిపైన బురద చల్లడం జగన్మోహన్ రెడ్డికి పరిపాటయింది అన్నారు. 74 సంవత్సరాల వయసులో కష్టపడుతున్న చంద్రబాబునాయుని కనీస గౌరవం లేకుండా సంబోధించడంతోపాటు ఆయనకు జైలుకు పంపించి నీటికి ఏడాది గడుస్తుంది అన్నారు. జగన్మోహన్ రెడ్డి నియంతృత్వ చర్యలను నిరసిస్తూ నల్లని వస్త్రాలతో ఒక్కరోజు దీక్షను పాటిస్తున్నట్లు ఈ సందర్భంగా గద్దె బాబురావు వివరించారు.

చంద్రన్నను అన్యాయంగా అరెస్ట్ చేశారు

రాజకీయకక్షతోనే అక్రమ కేసు

అక్రమ అరెస్ట్ పై తెలుగు ప్రజలు పోరాటం

70 దేశాలలో చంద్రబాబు కు మద్దతుగా నిరసనలు

విశాలాంధ్ర-చీపురుపల్లి: రాజకీయంగా అడ్డం తొలగించుకోవడానికి ఏ తప్పు చేయని నారా చంద్రబాబునాయుడుపై అన్యాయంగా అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసి వైసీపీ ప్రభుత్వం తనకు తానే మరణశాసనాన్ని లిఖించుకుందని విజయనగరం జిల్లా టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. చంద్రబాబును అక్రమ అరెస్టు చేసిన రోజే వైసీపీ ప్రభుత్వం నైతికంగా పతనమైందన్నారు. చీపురుపల్లిలో సోమవారం నాగార్జున విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టు కోట్లాదిమంది తెలుగు ప్రజల గుండెలను రగిలించిదన్నారు. నాలుగున్నర దశాబ్దాలుగా ప్రజా జీవితంలో రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమానికి నిరంతరం శ్రమించిన చంద్రబాబు నాయుడును అరెస్టు చేయడంతో ప్రపంచంలో ఉన్న తెలుగు ప్రజలతో పాటు దేశంలోని ప్రముఖులంతా సంఘీభావం తెలిపారన్నారు. హైదరాబాదులో ఐటి ఉద్యోగులు సైతం చంద్రబాబుకు మద్దతుగా పెద్ద ఎత్తున ఉద్యమించారన్నారు. గడిచిన ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలో అరాచకాలు, అకృత్యాలు, విధ్వంసకపాలనలో అక్రమ అరెస్టులు, కక్షపూరిత చర్యలు తప్ప ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటిరోజు నుంచి గద్దె దిగినంతవరకు చంద్రబాబు నాయుడుపై అవినీతి మరకలు అంటించేందుకు విశ్వప్రయత్నం చేశారన్నారు. ఎన్నో రకాలుగా చిత్రహింసలకు గురి చేశారన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్ట్ చేసి రాజమండ్రి జైల్లో ఎటువంటి సౌకర్యాలు లేకుండా వేధింపులకు గురిచేయడాన్ని ప్రజలు గమనించారన్నారు. చంద్రబాబును రాజమండ్రి జైల్లో పరామర్శించిన పవన్ కళ్యాణ్ బయటకు వచ్చి వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీతో కలిసి పోటీ చేస్తామని ప్రకటించడంతోనే విజయం నిశ్చితమైపోయిందన్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాల వల్లే వారికి కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. సంక్షేమం,అభివృద్ధి తో చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం ప్రగతిపదంలో నడుస్తుంది అన్నారు. కక్ష సాధింపు రాజకీయాలను ప్రజలు ఎప్పుడూ హర్షించరని అన్నారు.

వర్షాలకు పెద్దగా పంట నష్టం వాటిల్లదు

వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్ వెల్లడి

విశాలాంధ్ర-జామి: ప్రస్తుతం కురిసిన వర్షాల కారణంగా పలు ప్రాంతాలలో నీరు నిల్వ ఉండడం జరిగిందని, అయితే ఈనీటి వలన ఎటువంటి పంట నష్టం ఉండదని మండల వ్యవసాయాధికారి పి. కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని ముంపునకు గురైన ప్రాంతాలలో వ్యవసాయశాఖ ఎడిఎ ఎల్.విజయ పర్యటించారు. ఆమెతోపాటు ఎవో పంటలను పరిశీలన చేసి, తీసుకుంటున్న చర్యలను వివరించారు. అలాగే రైతులు చేయాల్సిన తక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. నిల్వ వున్న నీరు రెండు రోజులలో బైటకు పోతుందని, దీని కారణంగా పంటకు 99శాతం నష్టం ఉండదని ఎవో వివరించారు. ముందుగా రామయ్యపాలెం, భీమసింగి ప్రాంతాలలో పంటను పరిశీలించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ రామయ్య పాలెంలో 32ఎకరాలు, చింతాడలో 10 ఎకరాలు, భీమసింగిలో 50 ఎకరాలు, తాండ్రంగిలో 20 ఎకరాలు, అట్టాడతో 160 ఎకరాల పంట పూర్తిగా నీటిలో ముంపుకు గురైందన్నారు. రెండు రోజులలో నీరు తగ్గుతుందని, అనంతరం పంట నష్టం అంచనా వేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఈపరిశీలనలో రామయ్యపాలెం ప్రస్తుత సర్పంచ్ పాటూరి మణి, మాజీ సర్పంచ్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, భీమసింగిలో మాజీ ఎంపిటిసి దనియాల పైడిరాజు, మజ్జి హరికృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

గంజాయి రవాణా విక్రయాల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలి : ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-గంట్యాడ: జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సోమవారం గంట్యాడపోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ ప్రాంగణాన్ని భవనములోని గదులను ప్రాపర్టీ రూం లాకప్ గదులను సీజ్‌చేసిన వాహనాలను, ఆయా వాహనాలు ఏ కేసులో ఏ సందర్భంలో ఎప్పుడు సీజ్ చేయబడినవో తెలిపేవిధంగా లేబలు ఏర్పాటుచేయాలని పోలీస్‌చట్టం నిబంధనలు ప్రాప్తి మేరకు రికార్డులు తగువిధంగా నిర్వర్తించవలెనని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్రానం ధరించవలనని ట్రాఫిక్ రూల్స్ ను ప్రజలకు తెలియపరచవలనని భద్రతా నియమాలు పాటించే విధంగా చూడాలని సూచనలు చేశారు నేరాలు నియంత్రణకు పగలు రాత్రులు బీటులు వేయాలని అనుమానాస్పద వ్యక్తుల కదలికపై నిఘా ఏర్పాటు చేయాలని అన్నారు. మరియు వ్యక్తుల వేలిముద్రలను మొబైల్ ఫింగర్ ప్రింట్ చేక్ డివైజ్ తో సరిపోల్చి చర్యలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు మరియు అధికారులు నిర్వర్తించవలసిన అన్ని రికార్డులను కుళంకుశంగా పరిశీలన జరిగింది. ఎస్పీ జిల్లా ఎస్పీ స్టేషను సందర్శించిన సమయంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ కేకేవి విజయనాథ్, గంట్యాడ ఎస్సై సాయి కృష్ణ మరియు ఇతర పోలీసు అధికారులు స్టేషన్ సిబ్బంది హాజరైనారు.

నీట మునిగిన వరిపొలాలను పరిశీలించిన మండల ప్రత్యేక అధికారి ఎం సుధారాణి



విశాలాంధ్ర-భోగాపురం: భోగాపురం తూర్పు పడమర రెవెన్యూ గ్రామాలలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను మండల ప్రత్యేక అధికారి డిప్యూటీ కలెక్టర్ ఎం సుధారాణి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక వర్షాలు కారణంగా పంటలు నష్టపోకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి రైతులకు నిత్యం సలహాలు సూచనలు అందించాలని అన్నారు. అలాగే వ్యవసాయ అధికారులు నిత్యం రైతులకు అందుబాటులో ఉండాలని, పొలాలలో నిల్వ ఉన్న నీరు బయటకు పంపే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆగస్టు నెలలో సాధారణ వర్షపాతం కంటే గత రెండు రోజులుగా కురిసిన వర్షపాతం అధికంగా ఉందని మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని చెరువులు పై నుండి వచ్చే వరద నీటికి పంట పొలాలు పూర్తిగా నిండిపోయాయి అని ప్రత్యేక అధికారిక వివరించారు. కార్యక్రమంలో తహసిల్దార్ సురేష్, ఎండిఓ అప్పలనాయుడు, హౌసింగ్ ఏఈ చంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం

కలెక్టర్ అంబేద్కర్



విశాలాంధ్ర-వంగర: మడ్డువలస ప్రాజెక్టులో నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్నటువంటి కొండ చాకరాపల్లి కొప్పర గ్రామాలకు ముంపు ముప్పును తొగించటానికి ఆ గ్రామాలను స్వయంగా పరిశీలిస్తే తప్పశాశ్వత పరిష్కారం చేపట్టలేమని జిల్లా కలెక్టరు డాక్టరు బీ అర్ అంబేద్కర్ తెలిపారు. సోమవారం సాయంకాలం ఆయన మడ్డువలస ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం స్థానిక విలేఖర్లతో ఆయన మాట్లాడారు. మడ్డువలస ప్రాజెక్టు నిర్మించిన నుండి మండలంలో కొండ చాకరాపల్లి, కొప్పర గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి.అంతేకాకుండా పంటపొలాలుముంపు బారిన పడి నష్టాల పాలై ఇబ్బందులు పడుతున్నారు, ఆయా గ్రామాల కు ముంపు బారిన పడకుండా చర్యలు తీసుకోరా నన్న విలేఖర్ల ప్రశ్నలకు ఆయన భూములకు నష్టపరిహారం ఇచ్చాం.ఈ ప్రాజెక్టు పూర్తయ్యే సరికి అర్ అర్ లేదని సమాధానాన్ని దాటవేస్తూ,గతంలో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు పంపించారా నని కలెక్టర్,ఆయనతో ఉన్న సంబంధిత అధికారులను అడిగారు. వారు సరియైన సమాచారం ఇవ్వలేదు.దీంతో ఆయన ఆయా గ్రామాలనుపరిశీలించిన తదుపరి అవసరమైన చర్యలు తీసువివరించారు. రెండు దినాలు డ్యాంలో చేపలు వేటలను నిషేధించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు, పోలీసులకు ఆదేశాలు జారీచేశారు.మత్స్య కారులు కానీ,ఇతరులు ఎవరైననూ రెండు రోజులు తూఫాన్ ప్రభావం ఉంటుందని, అందుచే ఎవరినీ డ్యాం లోకి దిగనివ్వవద్దని స్పష్టంగా ఆదేశాలిచ్చారు. ఎవరైననూ ప్రాజెక్టులోకి చేపలు వేటలు ఏమైనా చేపట్టటానికి దిగిన వారిని వెంటనే తీసుకెల్లి లోపల వేయాలని ఆయన పోలీసులకు ఆదేశాలు జారీచేశారు. రెండు దినాల డ్యాంలో గుర్రపు డెక్కవల్ల ఇబ్బందులను,మగ్గూరు గ్రామానికి చెందిన మత్స్యకారులు, విలేఖర్ల గుర్రపు డెక్క వల్ల ఇబ్బంది లను ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఆయన డ్యాంలో గుర్రపుడెక్కను పరిశీలించారు. ఇటీవల గుర్రపు డెక్కవళ్ళ డ్యాంలో చిక్కు కోవటం మత్స్యకారులు ఇబ్బందులు గురయ్యారంటూ, గుర్రపు డెక్కను తొలగించటానికి డ్రోన్సు తో స్ప్రే చేసి తొలగించటానికి చర్యలు తీసుకోవలని చీపురు పల్లి అర్ డీ ఓ బి.శాంతిని అంబేద్కర్ ఆదేశించారు. దీనికి అవసరమైన నిధులు సమకూర్చనున్నట్లు, ప్రతిపాదనలు పంపించాలని ఆయన ఆమెను కోరారు. తూఫాన్ వల్ల జిల్లాలోఎటువంటిసమస్యలేదని కలెక్టర్ తెలిపారు. శనివారం మాత్రమే జిల్లాలో 18.5 సిఎం వర్షపాతం నమోదైందేతప్ప ఎటువంటి ఇబ్బంది లేదని ఆయన వివ రించారు. తుపాను కారణంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకొన్నట్లుపేర్కొన్నారు.చెరువులకు తదితర వాటికిఎటువంటి గండ్లు ఏమి లేకుండా చర్యలు చేపట్టామన్నారు. మరో రెండు రోజులు అధికారులకు దీనిపై తగు ఆదేశాలు ఇచ్చామన్నారు.ము దుగా ఆయన మడ్డువలస రిజర్వాయర్ ను పరిశీలించి మడ్డు వలస అధికారుల ను ప్రాజెక్టు స్థితి గతులపై జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఈఈ తదితరులను అడిగి అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్ లోకి వస్తున్న నీటిని బట్టి, నీటి విడుదలపై తగిన నిర్ణయం తీసుకోవాలనిప్రాజెక్టు అధికారులను ఆదేశించారు.ప్రాజెక్టు నుండి ఏ గ్రామంనకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకొంటామన్నారు. మడ్డు వలసరిజర్వాయర్ వద్ద సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి,డిప్యూటీ కలెక్టర్ సందీప్ కుమార్, అర్‌డీఓ బి.శాంతి, ప్రాజెక్టు ఈ ఈ మన్మదరావు,డీ ఈఈలుపీ అర్జున్, పీ.నాగేశ్వరరావు, ఏఈఈ లు నితిన్‌కుమార్, సూర్యనవేస్,ఎంపిడిఓ త్రినాదరావు, తహసీల్దార్ డీ.ధర్మరాజు, ఎంఅర్ఐ మురళీ, వీఆర్ ఓలు రాజు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపురం గ్రామస్తునికి డాక్టరేట్

విశాలాంధ్ర -లక్కవరపుకోట: మండలంలోని శ్రీరాంపురం గ్రామానికి చెందిన వి ఎస్ వి నరసింహంకు డాక్టరేట్ లభించిందని నరసింహం తెలిపారు సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగాచార్యులు ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం ఇన్చార్జి విసి ఆచార్య డివిఆర్ మూర్తి పర్యవేక్షణలో ఉత్తరాంధ్రలోని టెలివిజన్ జర్నలిస్టుల వృత్తిపరమైన పాత్ర అవగాహన మృతి పరమైన ప్రమాదాలు ఉద్యోగ సంతృప్తి అనే అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టర్ లభించిందని ఆయన తెలిపారు ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ అచార్య ఈ ఎన్ ధనుంజయ రావు నుంచి డాక్టరేట్ ఉత్తరవులను నరసింహం స్వీకరించారని తెలిపారు ప్రస్తుతం ఉత్తరాంధ్ర జిల్లాలో 8 0 శాతం మంది పైగా టెలివిజన్ జర్నలిస్టులు కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్నారని వీరికి తగినంత వృత్తిలో సంతృప్తి లేదని తన పరిశోధనలో గుర్తించారని తెలిపారు టెలివిజన్ జర్నలిస్టులకు వేస్ బోర్డులను అమలు చేయాలని ఈ రంగంలో యువత అడుగుపడే విధంగా తగిన ప్రోత్సాహ కాలు అందించాలని సూచించారు తాము నిర్వహిస్తున్న వృత్తిలో కలిగే సంతృప్తి వారిని వారి నిత్య జీవితం, ఆరోగ్యం పై ప్రభావం చూపుతోంది నిర్దిష్ట సమయం కన్నా అధికంగా టెలివిజన్ జర్నలిస్టులు పనిచేస్తున్నారని వీరికి అదనపు పనికి అదనపు వేతనం మాత్రం అందటం లేదని గుర్తించారు. సృజనాత్మక వృత్తిగా నిలిచే ఈ రంగంలో వారికి అవసరమైన వర్క్ ఎన్విరాన్మెంట్ మెరుగుపరచాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు టెలివిజన్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకమైన చట్టాలను చేయాలని సూచించారు. మహిళలు ఈ రంగంలో పనిచేస్తున్న దృశ్య వారికి కార్యాలయాల్లో చైల్డ్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు నరసింహుల ఏయూ విసి ఆచార్య జి శశిభూషణరావు విభాగాధిపతి సీఎం వినయ్ కుమార్, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య చల్ల రామకృష్ణ, విభాగాచార్యులు టి విజయలక్ష్మి, విభాగ పరిశోధకులు విద్యార్థులు అభినందించారు.

ముంపునకు గురైన వరి పొలాల పరిశీలన

విశాలాంధ్ర-గజపతినగరం : మండలంలోని గజపతినగరం మధుపాడ గ్రామాల్లో ముంపునకు గురైన వరి పొలాలను గజపతినగరం మండల వ్యవసాయ అధికారి సిహెచ్ ధనలక్ష్మి వ్యవసాయ సహాయకులు ఎల్ పవన్ కుమార్ లు సోమవారం సందర్శించారు అధిక వర్షాల కారణంగా మధుపడ మరియు గజపతినగరం గ్రామాల్లో సుమారుగా 20 ఎకరాలలో వరి పంట ముంపునకు గురైనట్లు గుర్తించారు అనంతరం వ్యవసాయ అధికారి సిహెచ్ ధనలక్ష్మి మాట్లాడుతూ పొలాల్లో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటికి తీసి వేయాలని తెలిపారు ఎకరానికి 20 కిలోల యూరియా మరియు 20 కిలోల పొటాషియం పై పాటుగా వేసుకోవాలని వరి పొలంలో పొడ తెగులు ఉధృతి ఎక్కువ అయ్యే అవకాశం ఉంది కావున దాని నివారణకు ప్రొపి కొన జోల్ ఒక మిల్లీలీటర్ లేదా ఎక్సోన జోల్ రెండు మిల్లీమీటర్లు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు అలాగే ఆకు ముడత నివారణకు లెటర్ నీటికి కార్బెట్ హైడ్రాక్సైడ్ రెండు గ్రాములు లేదా కలెక్షన్ పోలో మూడు మిల్లీలీటర్లు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు ఈ పరిశీలనకు మండల వైసీపీ నాయకులు బెల్లాన త్రినాధరావు మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు

పంట పొలాలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి

విశాలాంధ్ర-డెంకాడ: గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి వీటి రామారావు పినతాడివాడ గొడ్డుపాలెం పంట పొలాలను స్వయంగా పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వర్షం రైతులకు చాలా ఉపయోగపడిందని తెలిపారు వ్యవసాయ అధికారి నిర్మల మాట్లాడుతూ మోదవలస గ్రామ పంచాయతీలో పంట పొలాలను పరిశీలించి నారు ఇక్కడ పది ఎకరాలలో వరి పంట నీట మునిగిందని ఈ విషయం అధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పి.నిర్మల గ్రామ సర్పంచ్ లెంక లక్ష్మణరావు మాజీ గ్రామ సర్పంచ్ పల్లె భాస్కరరావు ఆర్. కిరణ్మయి గ్రామ వ్యవసాయ సహాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కూలిన పాఠశాల ప్రహరీ గోడను పరిశీలించిన ఎమ్మెల్యే కళావెంకటరావు

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లి నియోజకవర్గం చీపురుపల్లి మండలంలోని రావివలస పంచాయతీ నాగంపేట గ్రామంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా కూలిన ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడను టీడీపీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు మాట్లాడుతూ పాఠశాల భవనం పరిస్థితిపై ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని త్వరితగతిన ప్రహరీ గోడను నిర్మించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు అనంతరం పాఠశాల పరిసర ప్రాంతాన్ని సందర్శించారు. త్వరలోనే అన్ని మౌలిక వసతులతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.